www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 17 మార్చి 2023 5 ఏలూరు

గణపవరాన్ని భీమవరం రెవెన్యూ డివిజన్‌లో కలపాలి

గణపవరం: గణపవరం మండలాన్ని తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్లో కాకుండా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రెవెన్యూ డివిజన్‌లో కలపాలని కోరుతూ గురువారం మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసిన వినతిని సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సనుమూరి లక్ష్మీ భవాని శివప్రసాద్ ఎంపిడిఒ జి.జ్యోతిర్మయికి, తహశీల్దార్ సిహెచ్.కృష్ణస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ భవాని శివప్రసాద్ మాట్లాడుతూ గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపడం వల్ల మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజాప్రతినిధుల, ప్రజల కోరిక మేరకు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) కృషి మేరకు మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలపడం హర్షించదగ్గ విషయమన్నారు. అయితే ఇప్పటికే 90 శాతం మంది విద్యకోసం, వ్యాపారాల కోసం, తదితర విషయాలపై అధిక శాతం ప్రజలు భీమవరం వెళుతున్నారని తెలిపారు. గణపవరం మండలాన్ని తాడేపల్లి గూడెం రెవెన్యూ డివిజన్‌లో కలపడం వల్ల మండల ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు.



రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు నుంచి ఎంఎల్‌సిగా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్

వైసిపి విజయదుందుభి

స్థానిక సంస్థల రెండు ఎంఎల్‌సి స్థానాలు కైవసం

మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే సునాయాసంగా గెలుపు

ప్రతిపక్షాల ఓట్లు అధికారపక్షం ఖాతాలోకే

ఈ గెలుపు జగన్ పాలనకు నిదర్శనం

విజేతలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు ఎంఎల్‌సి స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. శాసనమండలి సభ్యులుగా వైసిపి అభ్యర్థులైన జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ గెలుపొందారు. ఈ నెల 13న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు గురువారం ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరిచి ఐదు టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఓట్ల లెక్కింపు చేపట్టిన గంట వ్యవధిలోనే ఫలితాలు వెలువడ్డాయి. వైసిపి అభ్యర్థి కవురు శ్రీనివాస్ మొదటి ప్రాధాన్యతా ఓట్లు 481 సాధించగా, మరోఅభ్యర్థి వంకా రవీంద్రనాథ్ 460 సాధించారు. టిడిపి బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు 122 ఓట్లు లభించాయి. మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు గోరింక దాసు, దేవరపల్లి ఆదాం, పసల వెంకటాచలంకు ఒక్క ఓటు కూడా రాలేదు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తం 1,105 ఓట్లకుగాను 1088 ఓట్లు పోలయ్యాయి. వాటిలో 1,063 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 25 ఓట్లు చెల్లనివిగా తేలాయి. చెల్లుబాటైన 1,063 ఓట్లలో 941 ఓట్లు మొదటి ప్రాధాన్యతగా వైసిపికే దక్కాయి. దీంతో వైసిపి అభ్యర్థుల గెలుపు ఖరారైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు ఓట్ల లెక్కింపును పరిశీలించారు.

విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

ఉదయం తొమ్మిది గంటలకే ఫలితాలు వెల్లడైనప్పటికీ మధ్యాహ్నం వరకూ అధికారికంగా వెల్లడించలేదు. గురువారం మధ్యాహ్నం అధికారికంగా ఫలితాలు ప్రకటించారు. ఎంఎల్‌సిలుగా గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లకు రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని, ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో డిఆర్‌ఒ ఎవిఎస్ఎస్.మూర్తి, ఆర్‌డిఒలు కె.పెంచల్‌కిషోర్, దాసి రాజు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, డ్వామా పీడీ రాంబాబు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ రామకృష్ణ, తహశీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న పశ్చిమ కలెక్టర్ ప్రశాంతి

కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రతిపక్షాల ఓట్లు వైసిపికే

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తం 1,105 ఓట్లు ఉండగా వీటిలో 920 ఓట్లు వైసిపికి చెందినవారే. 185 మంది టిడిపి, జనసేన, ఇతర పార్టీలు, స్వతంత్రులైన ప్రజాప్రతినిధులు ఉన్నారు. అధిక ఓట్లు ఉన్న వైసిపికి రెండుస్థానాలు ఏకగ్రీవంగా దక్కాల్సి ఉంది. అయితే టిడిపి నలుగురు స్వతంత్ర అభ్యర్థులను రంగంలోకి దింపింది. వీరిలో వీరవల్లి చంద్రశేఖర్‌కు టిడిపి అధికారికంగా మద్దతు ప్రకటించింది. అధికార పార్టీకి సంబంధించిన ఓట్లు చీలితే స్వతంత్ర అభ్యర్థి గెలుపు ఖాయమనే ప్రచారం సాగింది. మొత్తం 1,088 ఓట్లు పోలవగా వీటిలో వైసిపి అభ్యర్థులకు 941, టిడిపి బలపర్చిన స్వతంత్ర అభ్యర్థికి 122 ఓట్లు వచ్చాయి. అంటే ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లు సైతం వైసిపి అభ్యర్థులకే ఓటేసినట్లు తేటతెల్లమైంది.

అధికార పార్టీకి కలిసొచ్చిన డబ్బు పంపిణీ

స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో వైసిపిలో గుబులు మొదలైంది. దీంతో తమ ఓటర్లను కాపాడుకునేందుకు నియోజకవర్గాలవారీగా సమావేశాలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. తమకు డబ్బులిస్తేనే ఓటు వేస్తామనే డిమాండ్ వ్యక్తమవడంతో వైసిపి నాయకులు కంగుతిన్నారు. డబ్బు పంపిణీ చేయకపోతే ఓట్లు చీలి స్వతంత్ర అభ్యర్థికి వెళ్లే అవకాశం ఉందని అంచనా వేశారు. దీంతో ఓటుకు రూ.20 వేలు చొప్పున అధికార పార్టీ తమ సొంత ఓటర్లకు పంపిణీ చేయాల్సి వచ్చింది. ప్రతిపక్ష పార్టీల ఓటర్లకు కూడా డబ్బు పంపిణీ చేశారు. ఆ కారణంగానే ప్రతిపక్ష పార్టీల ఓటర్లు కూడా వైసిపి అభ్యర్థులకే ఓటు వేసినట్లు తెలుస్తోంది. రెండు స్థానాలను వైసిపి కైవసం చేసుకోవడంతో వైసిపి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి.

మెరుగైన పాలనకు నిదర్శనమే ఈ గెలుపు

కవురు శ్రీనివాస్

పేద ప్రజలకు నవరత్నాల పేరుతో ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. కులమతాలకు అతీతంగా పథకాలు అందిస్తోంది. మెరుగైన పాలనకు బహుమతిగా దక్కిందే ఈ గెలుపు. ప్రతిపక్ష పార్టీల ఓట్లు కూడా మాకు పడటమే దీనికి నిదర్శనం.

ఈ విజయం జగన్ సంక్షేమ పాలనకు నిదర్శనం

వంకా రవీంద్రనాథ్

రాష్ట్రంలో ప్రజలకు జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలితమే ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం. ప్రతిపక్షపార్టీల ఓటర్లు కూడా తమకే ఓటు వేయడం అందుకు నిదర్శనం. టిడిపికి మద్దతు లేదని తెలిసి స్వతంత్ర అభ్యర్థిని రంగంలోకి దింపి మద్దతిచ్చారు. ఈ తీరు దారుణం. స్థానిక సంస్థల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

స్వతంత్ర అభ్యర్థులు: గోరింక దాసు, దేవరపల్లి ఆదాము, పసల వెంకటాచలంకు ఒక్క ఓటు కూడా రాలేదు.

టేబుళ్ల వారీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి పేరు	టేబుల్-1	టేబుల్-2	టేబుల్-3	టేబుల్-4	టేబుల్-5	మొత్తం
కవురు శ్రీనివాస్	45	96	76	151	113	481
వంకా రవీంద్ర	130	72	87	80	91	460
వి.చంద్రశేఖర్	23	24	33	15	27	122
చెల్లని ఓట్లు	2	8	4	4	7	25

మొత్తం చెల్లుబాటు అయిన ఓట్లు: 1063

చెల్లనివి: 25

అన్నీ అరకొరే..!

సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్ర కేటాయింపులు

చింతలపూడికి రూ.272 కోట్లు, తాడిపూడికి రూ.22 కోట్లే

పోలవరం ప్రాజెక్టుకు రూ.5004 కోట్లు

డెల్టా ఆధునికీకరణకు రూ.12 కోట్లు విదిలింపు

ఆక్వా రైతుల విద్యుత్ రాయితీలపై మౌనం

కొల్లేరు రెగ్యులేటర్ల ప్రస్తావన కరువు

ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ ఊసే లేదాయే

నిర్వాసితుల హామీలకు కానరాని కేటాయింపులు

జిల్లావాసులను నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్

2023-24 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో జిల్లాకు సరైన కేటాయింపులు లేకుండాపోయాయి. ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టులకు అరకొర కేటాయింపులతో సరిపెట్టారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల గురించి ప్రస్తావన లేకుండాపోయింది. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ ఊసే లేకుండాపోయింది. పోలవరం నిర్వాసితుల హామీలకు సంబంధించి నిధుల వివరాలు ఎక్కడా కన్పించలేదు. మొత్తంగా బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి చూపారు. పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు ఒకింత ఊరటగా చెప్పొచ్చు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి చూపారు. దశాబ్దాల కాలంగా సాగుతున్న సాగునీటి ప్రాజెక్టు పనులకు ఈ బడ్జెట్‌లోనూ సరైన కేటాయింపులు లేకుండా పోయాయి. అరకొర కేటాయింపులతో మమ అన్పించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కేవలం రూ.272 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తక్షణం పూర్తి చేయాల్సిన మెయిన్ కెనాల్‌కు రూ.1500 కోట్లు అవసరం. 4.80 లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టుకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విధంగా కేటాయిస్తే మరో రెండు దశాబ్దాలు గడిచినా చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయ్యే పరిస్థితి ఉండదని చెప్పొచ్చు. చేసిన పనులకు పెండింగ్ బిల్లులే రూ.149 కోట్లు వరకూ ఉన్నాయి. కేటాయించిన నిధులు చేసిన పనుల చెల్లింపులకే సగం సరిపోతాయి. మిగిలే కొద్దిపాటి నిధులతో ప్రాజెక్టు పనులు ఏవిధంగా ముందుకు సాగుతాయో ప్రభుత్వమే చెప్పాలి. 2008లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును ఎప్పటికి పూర్తి చేస్తారో పాలకులే చెప్పాలి. మరో ఎత్తిపోతల పథకం తాడిపూడికి సైతం ఈ బడ్జెట్‌లో రూ.22 కోట్లు మాత్రమే కేటాయించారు. పిల్ల కాలువల తవ్వకాలు పూర్తయితే 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వానికి పట్టని పరిస్థితి నెలకొంది. 2004లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తిస్థాయిలో సాగు నీరందించలేని దుస్థితి ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టు మాత్రం పూర్తి కావడం లేదు. ఈ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు కేటాయిస్తే పూర్తయ్యే అవకాశం ఉన్నా పాలకులు పట్టించుకోని పరిస్థితి ఉంది. ఇక కొవ్వాడకు సంబంధించి రూ.5.29 కోట్లు కేటాయించగా, ఎర్రకాలువ ప్రాజెక్టుకు రూ.8.43 లక్షలు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.5,004 కోట్లు కేటాయింపు మాత్రం కొంత ఊరట కలిగించే అంశంగా చెప్పొచ్చు. పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న అన్ని ఇరిగేషన్ పథకాలకు సంబంధించి ఈ నిధుల కేటాయింపు జరిగింది. పోలవరం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రాజెక్టు అయినప్పటికీ కేంద్రం నిధుల విడుదలలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రాజెక్టు పనులతోపాటు నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం సైతం ఇవ్వని పరిస్థితి ఉంది. నిర్వాసితులకు పరిహారం అందక ప్రతియేటా విరుచుకుపడే గోదావరి వరదలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు, ఎకరాకు రూ.ఐదు లక్షలు అదనంగా ఇస్తామన్న హామీలకు సంబంధించి సైతం నిధుల కేటాయింపు ఎక్కడా కన్పించలేదు.

ఆక్వా రైతుల ఊసే లేదు

ఆక్వా రైతులు విద్యుత్‌కు సంబంధించిన రాయితీలు ఆక్వాజోన్లతో సంబంధం లేకుండా కొనసాగించాలని కోరుతున్నారు. దీనిపై బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావనా లేకుండాపోయింది. తీవ్ర నష్టాలను చవిచూస్తున్న ఆక్వారైతులకు ఏమాత్రం ఊరట లేకుండాపోయింది. దీంతో ఆక్వా రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సంక్షేమ పథకాలకు కేటాయింపులు మినహా అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రస్తావనే పెద్దగా కానరాలేదు.

డెల్టా ఆధునికీకరణకు రూ.12 కోట్లే

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డెల్టా ఆధునికీకరణ. కాలువలన్నీ పూడుకుపోయి, షట్టర్లు పాడైపోవడంతో నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురై రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఇంకా రూ.600 కోట్లు విలువైన డెల్టా ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉండగా ఈ బడ్జెట్‌లో కేవలం రూ.12 కోట్లు మాత్రమే కేటాయించారు. రెండు జిల్లాలకు కలిపి దాదాపు రూ.24 కోట్లు వరకే బడ్జెట్‌లో కేటాయింపులు చూపారు. దీంతో డెల్టా ఆధునికీకరణ ఈ ప్రభుత్వ హయాంలో జరిగే పని కాదని స్పష్టమవుతోంది.

అభివృద్ధి పనులకు నిధులు సున్నా

జిల్లాలో ప్రధానమైన అభివృద్ధి పనులకు కూడా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు కన్పించలేదు. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, వేములదీవిలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి నిధుల కేటాయింపులు లేకుండాపోయాయి. వీటికి రూ.300 కోట్లు చొప్పున అవసరమని అంచనాలు ఉన్నప్పటికీ నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. కొల్లేరులోకి సముద్రపు నీరు రాకుండా దుంపగడప, మొల్లపర్రు, పడితడక వద్ద మూడు రెగ్యులేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రూ.412 కోట్లు అంచనాలు సైతం రూపొందించారు. రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి నిధుల కేటాయింపు మాత్రం ఎక్కడా కన్పించలేదు. దగ్గులూరులోని మెడికల్ కాలేజీకి నిధుల ఊసే లేకుండాపోయింది.

బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేసింది. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమని చెప్పొచ్చు. మెట్ట ప్రాంతానికి అత్యంత ముఖ్యమైన చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అరకొర నిధులు కేటాయించారు. జిల్లాలోని అభివృద్ధి పనులకు సైతం నిధుల కేటాయింపులో బడ్జెట్‌లో తీవ్ర నిర్లక్ష్యం కన్పించింది.

స్థానిక సంస్థల సమస్యలపై మండలిలో మాట్లాడతా

ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

తణుకు: స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌సిగా ఎన్నికైన వంకా రవీంద్రనాథ్ చెప్పారు. గురువారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను అఖండ మెజార్టీతో గెలిపించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు చిన్ననాటి నుంచి రాజకీయాలపై అవగాహన ఉందని, తన తండ్రి వంకా సత్యనారాయణ మూడుసార్లు ఎంఎల్ఎగా పని చేశారని గుర్తు చేశారు. ఆ అవగాహన, అనుభవంతో శాసనమండలిలో ప్రజా సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు రాబట్టడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. జిల్లాలో వైసిపికి స్థానిక సంస్థల్లో ఉన్న ఓట్లు కన్నా వంద ఓట్లు అదనంగా వచ్చాయని, ఇది ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ఫలితమని అన్నారు.

హోంమంత్రి, చీఫ్ విప్‌లను కలిసిన కవురు

పాలకొల్లు: ఎంఎల్‌సిగా ఎన్నికైన కవురు శ్రీనివాస్ గురువారం సాయంత్రం అమరావతిలోని అసెంబ్లీలో రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, నేతలు గుణ్ణం నాగబాబు, డిటిడిసి బాబు, చిట్టూరి ఏడుకొండలు ఉన్నారు.

ఆదర్శప్రాయులు పొట్టి శ్రీరాములు

ఏలూరు టౌన్: యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయులని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎన్నికల పరిశీలకులు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఏలూరు ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి పి.అరుణ్‌బాబు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేషకృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎవిఎస్ఎస్.మూర్తి, జెడ్‌పిటి సిఇఒ కె.రవికుమార్, ఆర్‌డిఒలు కె.పెంచల కిషోర్, మల్లిబాబు, ఏలూరు డిఎస్‌పి పైడేశ్వరరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాలకృష్ణన్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, డ్వామా పీడీ డి.రాంబాబు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎంఎల్‌సి కవురుశ్రీనివాస్ బయోడేటా

పేరు : కవురు శ్రీనివాస్

స్వగ్రామం : పొలమూరు శివారు నాగళ్ళ దిబ్బ, పెనుమంట్ర మండలం

తల్లి : కవురు సత్యవతి

తండ్రి : కవురు సర్వారావు

భార్య : బాల త్రిపురసుందరి

పిల్లలు : ఇద్దరు (అమ్మాయిలు)

కులం : బిసి-బి(శెట్టి బలిజ)

చదువు : ఇంటర్మీడియట్, వీరవాసరం

పుట్టిన తేదీ : 15-12-1978

రాజకీయ ప్రస్థానం: వైసిపిలో 2014 నుంచి 2019 వరకూ వీరవాసరం ఎంపిపిగా పనిచేశారు. ఆచంట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా రెండున్నర సంవత్సరాలు, అనంతరం రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి అధ్యక్షులుగానూ పనిచేశారు. వైసిపి నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ బిసి సమన్వయకర్తగానూ కొనసాగారు. 2019లో నరసాపురం అసెంబ్లీ ఎన్నికల వైసిపి ఇన్‌ఛార్జిగా, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా, డిసిసిబి ఛైర్మన్‌గా పలు పదవులను కవురు శ్రీనివాస్ అలంకరించారు.

స్థానిక సంస్థల ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ బయోడేటా

పేరు: వంకా రవీంద్రనాథ్

పుట్టిన తేదీ: 5 డిసెంబర్ 1968

తల్లిదండ్రులు: నాగమణి, సత్యనారాయణ (తండ్రి సిపిఐ నేత, మూడుసార్లు ఎంఎల్ఎగా గెలుపొందారు)

భార్య: వంకా రాజకుమారి (2004లో తణుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు)

పిల్లలు: కుమారుడు రఘువీరా, కుమార్తె రవళి

రాజకీయ ప్రస్థానం: పారిశ్రామికవేత్తగా ఉన్న రవీంద్రనాథ్ 2014 ఎన్నికల్లో వైసిపి తరపున నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆపై వైసిపి కేంద్ర రాజకీయ సలహా కమిటీలో పని చేశారు. వైసిపి నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా, రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకునిగా పని చేశారు. వైసిపి అధికారంలోకొచ్చాక ఎంఎస్ఎంఇ ఛైర్మన్‌గా పని చేశారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 106 కేంద్రాల్లో తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషా పరీక్షలు జరిగాయి. కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభమవ్వగా ఎక్కువ మంది విద్యార్థులు 8 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఇంటర్ బోర్డు అధికారులు విస్తృత ప్రచారం చేయడంతో విద్యార్థులంతా నిర్దేశిత సమయం కంటే ముందుగానేకేంద్రాలకు చేరుకోవడంతో ఒక్క నిమిషం నిబంధన కారణంగా ఎవరినీ ఆపిన దాఖలాలు కన్పించలేదు. పరీక్షల నిర్వహణ తీరును ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి.

32,668 మంది హాజరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 106 కేంద్రాల్లో మొత్తం 33,638 మంది విద్యార్థులకుగాను 32,668 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 10809 మంది జనరల్ విద్యార్థులకు 10,477 మంది హాజరవ్వగా 332 మంది గైర్హాజరయ్యారు. 1615 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1487 మంది హాజరవ్వగా 128 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 14,897 మంది జనరల్ విద్యార్థులకు 14,584 మంది హాజరవ్వగా 313 మంది గైర్హాజరయ్యారు. 1539 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1436 మంది హాజరవ్వగా 103 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 15 కేంద్రాల్లో 4,097 మందికి 4038 మంది హాజరవ్వగా 59 మంది గైర్హాజరయ్యారు. 681 మంది ఒకేషనల్ విద్యార్థులకు 646 మంది హాజరయ్యారు. మొత్తంగా 97 శాతం హాజరు నమోదైంది. కొవ్వూరులో ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

ఏలూరులోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

దొండ పందిళ్ల సబ్సిడీ బాకాయిలు ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

పెదవేగి: దొండ పందిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని, కూరగాయల సాగు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని సీతాపురం, కూచింపూడి, రామసింగవరం తదితర గ్రామాల్లో రైతు సంఘం నాయకులు గురువారం పర్యటించి దొండ పందిళ్ల సాగును పరిశీలించారు. కూరగాయల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరం దొండ పందిరి సాగుకు పందిరితో కలుపుకుని రూ.నాలుగు లక్షల వరకూ పెట్టుబడి అవుతోందన్నారు. గత ప్రభుత్వం పందిరి యూనిట్ విలువ రూ.రెండు లక్షలుగా నిర్ణయించి 50 శాతం సబ్సిడీ పథకం అమలు చేసిందని, గత ప్రభుత్వ హయాంలో దొండ పందిళ్లకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలున్నాయని చెప్పారు. గత బకాయిలను చెల్లించి, దొండ పందిళ్ల సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. కూరగాయల రైతులు సమస్యలపై ఆందోళనకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.ఏడుకొండలు, రైతులు పాల్గొన్నారు.

విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోండి : రైతు సంఘం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతులను నట్టేట ముంచుతున్న విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గొల్లపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూజివీడు మండలం యనమదల, సుంకొల్లు, ముసునూరు మండలం కాట్రేనిపాడుతోపాటు పలు ప్రాంతాల్లో రైతులను విత్తన కంపెనీలు నిండాముంచాయన్నారు. మోసపోయిన రైతులకు కంపెనీల నుండి నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

5న చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంలో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాని అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.జీవరత్నం, రైతు సంఘం మండల కార్యదర్శి బొడ్డు రాంబాబు, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యవసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ ప్రజలపై పెనుభారాలు మోపుతుందన్నారు. ఈ సమావేశంలో అందులో ప్రభాకరరావు, వి.గోపి, రాంబాబు, జి.బాలరాజు, బి.ఆశీర్వాదం, బి.నాని, స్టాలిన్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని ఉప్పాకపాడులో ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను ఆధ్వర్యంలో ఫౌండేషన్ స్కూల్ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. గ్రామ సర్పంచి నేమాని మోహన్‌రావు, ఉప సర్పంచి షేక్ మస్తాన్ వలీ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ వంటిపల్లి రామకృష్ణ, వైస్ ఛైర్మన్ మేరీకర్షకుమారి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు ఉన్నారు. వార్షికోత్సవంలో మెజీషియన్ చింతాడ శివ మ్యాజిక్ షో అలరించింది. అనంతరం ఉపాధ్యాయులను గ్రామస్తులు సన్మానించారు.

ధరల పట్టిక ప్రదర్శించాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఎరువులు, పురుగుమందుల విక్రేతలు వాటి ధరల వివరాలను ప్రదర్శించాలని వ్యవసాయ శాఖ చింతలపూడి సహాయ సంచాలకులు బుజ్జిబాబు కోరారు. మండలంలోని గుండుగొలను, భీమడోలులో ఉన్న ఎరువులు, పురుగుమందుల విక్రయశాలలను, గోదాములను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదరు దుకాణాల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు ఇతరాలను పరిశీలించారు. ఇ-పోస్ యంత్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు వ్యవసాయ అధికారి ఎస్‌వి.ఉషారాణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణపరమైన అనర్థాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలకుమారి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాణి, లెక్చరర్లు టి.అక్షిరాజు, కె.సత్యనారాయణ, సి.హెచ్.అనురాధ, సిహెచ్.చైతన్య, ఎన్‌ఎస్‌ఎస్.శ్రీనివాసరావు, ఎన్‌కె.పర్వీన్ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ వడ్డీతో రుణం

ప్రజాశక్తి - కైకలూరు

స్లాబ్ వేసుకున్న ప్రతి ఇంటి లబ్ధిదారు ఫినిషింగ్ వర్క్స్ కోసం ప్రయివేట్ బ్యాంకులను ఆశ్రయించి అధిక వడ్డీకి గురి కావద్దని ఎంఎల్‌ఎ ప్రభుత్వ బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే రుణం ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామని ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్ తెలిపారు. స్థానిక వైఎస్‌ఆర్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో గురువారం ఎంపిపి అధ్యక్షతన స్లాబ్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి లబ్ధిదారులతో మాట్లాడుతూ రానున్నకాలంలో ఎంతో విలువైన ఆస్తిని ముఖ్యమంత్రి జగనన్న సమకూర్చారన్నారు. వైస్ ఎంపిపి మహమ్మద్ జహీర్, గ్రామ సర్పంచి నవరత్నకుమారి, హౌసింగ్ ఎఇ శేఖర్ లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంపై తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక అశ్వారావుపేట రోడ్డు జెడ్‌పిహెచ్ స్కూల్ సమీపంలో వివాదాస్పద స్థలంపై తహశీల్దార్ స్లీవజోజి విచారణ చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇరు గ్రూపుల నుంచి సంబంధిత ఆధారాలపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్లీవజోజి మాట్లాడుతూ జెడివిఎ పట్టణంలో పలుచోట్ల స్థలాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమణలు జరుగుతున్నాయని ప్రచార మాధ్యమాల ద్వారా తెలిసిందని చెప్పారు. వివాదాస్పద స్థలం సర్వే నెంబర్ 449లో 60 సెంట్లు దొంక పోరంబోకు స్థలం ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో గుర్తించామని తెలిపారు. ఈ సర్వే నెంబర్‌లో చిన్న కృష్ణారావు కుటుంబ సభ్యులకు నాలుగు సెంట్ల స్థలం ఉందని, ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుల నుంచి సెక్షన్ 145 ప్రకారం గొడవలు జరగకుండా రెవెన్యూ అధికారులు విచారణ చేయాలని సిఫారసు అందించిందని తెలిపారు. ఇరుగ్రూపుల వారిని ఆ స్థలంలోకి వెళ్లరాదని సూచించామన్నారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల ఆధారాలను పరిశీలించినట్లు తెలిపారు. ఇరువురి వద్ద ఉన్న ఆధారాలతో రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

త్వరలో గురుకుల పాఠశాల భవన నిర్మాణం పూర్తి

చింతలపూడి :2024 ఆగస్టు నాటికి బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల భవనం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా చెప్పారు. పాఠశాల భవన నిర్మాణాన్ని, మార్కెట్ యార్డు వద్ద నిర్వహిస్తున్న పాఠశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు ప్రారంభించి త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం కాంపౌండ్ వైరింగ్ చేయిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్‌తో పనులు త్వరగా చేయాలని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ బి.గోపీచంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనిల్‌కుమార్, డిప్యూటీ ఇంజినీర్ ఎ.కోటేశ్వరరావు, కాంట్రాక్టర్ డి.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన ఏలూరు రూరల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు మాదేపల్లి ఇందిరా కాలనీకి చెందిన ఆంజనేయులు (45) ఆటో నడుపుతూ పాత ఐరన్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆంజనేయులు గురువారం ఆటోలో శ్రీపర్రు వైపు వెళ్తూ కాజ్ వే దాటుతుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు బోధనాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

జీలుగుమిల్లి :జీలుగుమిల్లి పాత సినిమా హాలు సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం నుంచి స్కూటీపై వెళ్తున్న మహిళను వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పంగిడిగూడెం గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పంగిడిగూడెంకు చెందిన వీరవల్లి సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 200 లీటర్ల బెల్లపుఊట, ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సాగర్‌బాబు తెలిపారు. బెల్లపు ఊటను ధ్వంసం చేసి సుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

పది విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళికలు

వెనుకబడినవారిపై ప్రత్యేక శ్రద్ధ

బాబురావు, పొట్టి మాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యర్రగుంటపల్లి

చింతలపూడి : వెనుకబడిన పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని పొట్టి మాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యర్రగుంటపల్లి ప్రధానోపాధ్యాయులు బాబురావు వెల్లడించారు. పదో తరగతి పరీక్షలు భవిష్యత్తుకు ఎలా పునాదిగా మారుతాయో విద్యార్థులకు తెలియజేస్తున్నామన్నారు. చదువుతోనే సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని విద్యార్థులకు తెలిసేలా విద్య బోధిస్తున్నామని చెప్పారు. పొట్టి మాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 80 మంది విద్యార్థులు ఉన్నారని, తెలుగు మీడియంలో 20 మంది బాలురు, 17 బాలికలు, ఇంగ్లీషు మీడియంలో 27 మంది బాలురు, 16 మంది బాలికలు ఉన్నారన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం సాయంత్రం ప్రత్యేక స్టడి అవర్స్, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎటువంటి ఒత్తిడి లేకుండా, సులభమైన పద్ధతిలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. వెనుకబడిన విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి వారు కూడా వారి పిల్లలపై దృష్టి పెట్టేలా చూస్తున్నా మని చెప్పారు. జిల్లాలో వెనుకబడిన విద్యార్థుల కోసం రూపొందించిన విజయకేతనంతో ప్రణాళిక బద్దంగా చదివిస్తున్నామన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులతో కలిసి నూటికి నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

దత్తత తీసుకుని విద్యాబోధన

కె.రాఘవన్, జెడ్‌పిహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, గూటాల

పోలవరం : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించామని గూటాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాఘవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మధ్యస్థ, మెరుగైన విద్యార్థులను గ్రేడులుగా విభజించి అందరూ సమాన స్థితికి చేరేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారన్నారు. పరీక్షలంటే భయం పోగొట్టేలా ప్రాథమిక అంశాలను బోధిస్తూ భయాన్ని వీడాలనే విషయాన్ని విద్యార్థులకు వివరిస్తున్నారు. విద్యార్థులను బృందాలుగా విభజించి ఉపాధ్యాయులు దత్తత తీసుకుంటున్నారని తెలిపారు. సి, డి గ్రేడులుగా విభజించి శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా ఆంగ్లం, గణితం బోధిక రసాయన శాస్త్రాల్లో తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించడం ఎలా అనే విషయాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు ఆరు నుంచి పది మంది వరకు విద్యార్థులను దత్తత తీసుకొని ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులతో పాటు రోజువారి పాఠశాల సమయంలో సైతం విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. రోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదివిన అంశాలు గుర్తుండేలా టెస్ట్‌ల రూపంలో పరీక్షలు నిర్వహిస్తున్నారని, విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి వెనకబడిన వారిపై దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

రవీంద్రకుమార్, మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, భీమడోలు



భీమడోలు : గత అనేక సంవత్సరాల కాలంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కొనసాగుతున్న భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రస్తుత సంవత్సరం సైతం అదే ఒరవడిని కొనసాగించేందుకు కృషి చేస్తుందని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. గత అకాడమిక్ సంవత్సరాలతో పోల్చుకుంటే ప్రస్తుత సంవత్సరం నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల్లో అమలు చేయనున్న మార్పులకు అనుగుణంగా అధునాతన రీతిలో విద్యాబోధన చేసినట్లు ఆయన తెలిపారు. ఇదే క్రమంలో విద్యార్థులకు ఒత్తిడి లేని విధంగా పరీక్షలకు హాజరయ్యే విధంగా విద్యాబోధన చేస్తున్నామన్నారు. వారు పరీక్షలకు హాజరయ్యేందుకు అన్ని విధాలా సిద్ధపరుస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కోవిడో, ఇతరాలు విద్యార్థులను ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారు సరైన పౌష్టికాహారం తీసుకోవటం, ఆరోగ్యం కాపాడుకోవడం వంటి విషయాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థులు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ పరీక్షలను విడివిడిగా కాక ఒకే పేపర్‌గా రాయాల్సిన నేపథ్యంలో విద్యార్థులకు సదరు పేపర్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటికే పాఠశాల స్థాయిలో అంతర్గతంగా నాలుగు సార్లు సదరు విధానంలో పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఇదే క్రమంలో కొందరు విద్యార్థులు విద్యను నేర్చుకోవడంలో వెనుకబడి ఉన్నందున వారిని ప్రత్యేకంగా గుర్తించామన్నారు. వారికి పరీక్షల్లో ఇబ్బందులు లేనివిధంగా మార్కులు సాధించేందుకు చిన్న చిన్న ప్రశ్నలు జవాబులు రాయటంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇదే క్రమంలో మంచి చేతి రాతతో జవాబులను నీటుగా రాయటంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్లిప్ టెస్ట్ పరీక్షలు, పాఠ్యాంశాల రివిజన్ కార్యక్రమం చేపట్టామన్నారు. పాత పరీక్షల మోడల్‌పేపర్లపై ప్రత్యేక శిక్షణ ఇవ్వటం ద్వారా పరీక్షలకు హాజరయ్యే విధానాల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాల నుంచి 162 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వీరిలో గొట్టాపు కార్తీక్, ఉండి సాత్విక్, కోడూరి సత్య సాహితి, శేషపు మోక్షిత, యలమర్తి సంకీర్త్, పెరుమాళ్ల పవిత్ర 590, మరో ఐదుగురు 580పైగా మార్కులు సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. 50 మంది వరకు విద్యార్థులు 550 మార్కులు పైగా మార్కులు సాధించే అవకాశం ఉందని, మిగిలిన వారిలో అత్యధికులు 500 మార్కులు పైగా సాధించే అవకాశాలు ఉన్నాయని, వారిని ఆ మేరకు సిద్ధం చేశామని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం ఎంబిబిఎస్‌లో ప్రవేశానికి నీట్ పరీక్ష రాసిన వారిలో పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల తోట బిందు, భలే రాజా సాయేంద్ర, షేక్ సామియాన హసేన వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఫ్రీ సీట్లు సాధించారని తెలిపారు. ప్రస్తుత విద్యార్థులు సైతం ఆ స్థాయికి చేరుకున్నప్పుడు ఆయా విద్యాసంస్థల్లో ఫ్రీ సీట్లు సాధించేందుకు అవసరమైన కార్యక్రమాల పట్ల ఇప్పటినుంచే శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.

ప్రత్యేక టైం టేబుల్, ప్రణాళిక

ఎస్.రామారావు, జెడ్‌పిహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి : త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నట్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రామారావు తెలిపారు. పాఠశాలలో 54 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక టైం టేబుల్ కేటాయించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అందుకు విజయకేతనం మెటీరియల్‌ను అందించినట్లు చెప్పారు. ఆయా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. అందుకు డైలీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వెంకటరమణ మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వడ్రం పనివార్ల సంఘాన్ని బలోపేతం చేయటమే కెల్లా వెంకటరమణకు నిజమైన నివాళి అని సిఐటియు జిల్లా నాయకులు చింతకాయల బాబురావు, ఎవిఆర్ విజ్ఞానకేంద్రం కార్యదర్శి జివిఎల్.నరసింహరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు అన్నారు. వడ్రం పనివార్ల సంఘం ఏలూరు నగర అధ్యక్షులు కెల్లా వెంకటరమణ (53) బుధవారం రాత్రి 11 గంటలకు ఏలూరు సత్రంపాడులోని నెహ్రూనగర్‌లో గుండెపోటుతో మరణించారు. గురువారం వెంకటరమణ మృతదేహానికి వారితో పాటు జిల్లా వడ్రం పనివార్ల సంఘం అధ్యక్షులు మారేడు పూడ వీరభద్రచారి, జిల్లా కార్యదర్శి వెంపటాపు శ్రీమన్నారాయణ, తామరపు మోహన్‌రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా వర్కింగ్ సెక్రటరీ డి.నాగబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరమణకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెంకటరమణ తన కుటుంబం కంటే సంఘం పని కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించారని, భవన నిర్మాణ సంఘం కార్యాలయం నిర్మాణానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. వెంకటరమణ మతదేహానికి వడ్రం పనివార్ల సంఘం రాష్ట్ర కోశాధికారి వేముల దుర్గాప్రసాద్, ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్, కోశాధికారి కాటకోటి ప్రకాష్, ఏలూరు నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి మానేపల్లి నాగేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు అప్పల బత్తుల శివ శ్రీ స్వర్ణకారుల సంఘం నాయకులు నల్లపాటి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

వెంకటరమణ (ఫైల్)

ఇకెవైసి 98.23 శాతం పూర్తి

17 వరకు సామాజిక తనిఖీ
జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రబీ 2022-23 సీజన్‌లో 2,36,148 ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదు పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రబీ 2022-23 ఇ-క్రాప్ నమోదు తుది గడువును ఈ ఏడాది ఫిబ్రవరి పదిగా నిర్ణయించినట్లు తెలిపారు. క్రమేపి ఆ గడువును పొడిగిస్తూ పత్రికా ప్రకటనలు, ఆర్‌బికె సిబ్బంది ద్వారా రైతులను చైతన్యపరచి పంట సాగు చేసిన ప్రతి రైతు ఇ-క్రాప్ నమోదు చేయాలన్న ఆలోచనతో ఆ గడువును మార్చి నాలుగో తేదీ వరకు పొడిగించి ఇ-క్రాప్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ రబీ 2022-23 సీజన్‌లో 2.36 లక్షల ఎకరాలు ఇ-క్రాప్ నమోదు చేసి, రైతుల ఇ-కెవైసి 98.23 శాతం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇదే ఖరీఫ్ 2022 సీజన్‌లో 5.13 లక్షల ఎకరాలు ఇ-క్రాప్ నమోదు పూర్తి కాగా రైతుల ఇ-కెవైసి 89 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్ కంటే ఈ రబీ సీజన్‌లో 9 శాతం ఎక్కువ మంది రైతులు ఇ-కెవైసి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ఆర్‌బికెల వద్ద మార్చి పదో తేదీన ఇ-క్రాప్ ముసాయిదా జాబితా పెట్టినట్లు పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆర్‌బికెల్లో ప్రదర్శిస్తున్న రబీ 2022-23 సీజన్‌కి సంబంధించి ఇ-క్రాప్ ముసాయిదా జాబితా ఈ నెల 13 నుంచి 17తేదీ వరకు సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించనున్నట్లు, గ్రామసభలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు

గణపవరం :గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూ ల్, మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఐరన్ మాత్రలు అందించినట్లు పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించి విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగా హన కల్పించారు. ప్రతి గురువారం విద్యార్థులు ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. వేసవిలో ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు సిహెచ్‌ఒ జె.విల్సన్‌బాబు, ఆరోగ్య కార్యకర్తలు ఎం.యోహాను, కె.మార్తమ్మ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ముదినేపల్లి :మండల కేంద్రమైన ముదినేపల్లిలో గురువారం ఆక్రమణలను పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. పోల్‌రాజ్ వంతెన వద్ద నుంచి గురజ రోడ్డు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న రోడ్డు ఆక్రమణలను గ్రామ పంచాయతీ కార్యదర్శి టివి.సారథి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు తొలగించారు. వ్యాపారులు రోడ్డును, డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ చెత్తా చెదారాలు డ్రెయినేజీలో వేసి పూడ్చి వేస్తున్నారు. మరికొందరు వ్యాపారు లు ప్రధాన రహదారిపై వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలుగుతోంది. కొందర అక్రమ నిర్మాణాల్లో మద్యం విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మరికొందరు స్థలాలను వేలాది రూపాయాలకు అద్దెలకు ఇస్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. వ్యాపారుల నుంచి ఎటువంటి ప్రతిఘటన ఎదురుకాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మద్ది ఆదాయం రూ.27.58 లక్షలు

జంగారెడ్డిగూడెం :మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపులో రూ.27,58,946 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. 49 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు ఆలయ ప్రాంగణంలో తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో గురువారం నిర్వహించినట్లు తెలిపారు. దేవస్థానం హుండీల ద్వారా రూ.25,65,163, చిల్లర నాణెముల రూపంలో రూ.1,17,706, అన్నదానం హుండీ ద్వారా రూ.75,400, చిల్లర నాణెముల రూపంలో రూ.677 మొత్తం రూ.27,58,946 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

20న విజయవాడలో ధర్నా : సిఐటియు

కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న విజయవాడలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మల్లుకుంట, వల్లంపట్ల, బొరంపాలెం, వెంకటాపురం, మధ్యాహ్నపువారిగూడెం, ఎపికుంట, టి.నరసాపురం పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను సమస్యలు తెలుసుకుంటూ గురువారం కరపత్రాలు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నూతన మెనూ వల్ల కార్మికులు అప్పుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్యాస్ ధర పెంపుతో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యవసర వస్తు ధరలకు అనుకూలంగా మెనూ ఛార్జి రూ.20 ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి - పెదవేగి

రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం మరువలేనిదని పెదవేగి ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్ అన్నారు. పొట్టి శ్రీరాములు 123వ జయంతిని పురస్కరిం చుకుని మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ కెవి జాన్సన్, సీనియర్ అసిస్టెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో మండం సత్యనారాయణ మూర్తి, అద్దంకి రవి, మాదంశెట్టి సోమంరాజు, అద్దంకి జగ్గారావు, ఆదిత్యకుమార్, మోహన్‌కుమార్, మల్లికార్జునరావు, పురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠాశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళార్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు మాట్లాడారు. పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్యోద్యమ ఘట్టాల్లో పాల్గొని పలుమార్లు జైలుశిక్ష అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడని కొనియాడారు.

చాట్రాయి : చాట్రాయి ఎంపిడిఒ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఇఒపిఆర్‌డి ఎంవిఎస్.నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ సీతారామారావు, జూనియర్ అసిస్టెంట్ నవ్య, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఇసి ధారా చంద్రమోహన్‌రావు పాల్గొన్నారు.

ముసునూరు : మహనీయులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని ఎంపిడిఒ జి.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి సాయిరాము, ఎఒ టివి.నరిసింహరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్ పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు వూర శ్రీధర్, టౌన్ అధ్యక్షులు ఎంపిటిసి నీలి సుమన్, సొసైటీ త్రీ సభ్య కమిటీ ఛైర్మన్ వూర కల్యాణి, వాసవీ క్లబ్ కలిదిండి గోల్డ్ అధ్యక్షులు నూకల శ్యామలరావు గుప్తా, వనిత కలిదిండి గోల్డ్ అధ్యక్షులు నీలి మాధవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు దుస్తులు, నగదు సాయం వంటి కార్యక్రమాలను మహిళా వాసవీ క్లబ్ చేపట్టింది. ఆర్యవైశ్య సంఘం మండల కార్యదర్శి నార్కెడమిల్లి పెరుమాళ్ల గుప్తా, సంఘ నాయకులు చక్కా జగన్మోహనరావు, సొలస వసంత లక్ష్మి పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - కలిదిండి

జగనన్న ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగినట్లు స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై నూజివీడు సబ్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ మండలంలోని వెంకటాపురంలో గురువారం విచారణ చేపట్టారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారుల నుంచి సమాచారం సేకరించినట్లు ఆయన తెలిపారు. విచారణ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు రాజేంద్రన్ తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు నిర్వహించిన తెలుగు, సంస్కృతం పరీక్షలకు 229 మందికి పది మంది గైర్హాజరు కాగా, 219 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. విజయవాడ నుంచి వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నిమిషం నిబంధన ఉండడంతో పలువురు విద్యార్థులు ఉరుకులు, పరుగులతో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

గణపవరం : గణపవరం జూనియర్ కాలేజీలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సారా లకు చెందిన విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేప థ్యంలో గురువారం కాలేజీని ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ ఎం.రఘు తెలిపారు. రెండో రోజు విద్యార్థులకు హిందీ, తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు మొత్తం 243 మంది విద్యార్థులకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. కాలేజీని పరిశీలించిన స్క్వాడ్ అధికారులు పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులను దూరం దూరంగా కూర్చోపెట్టిన పద్ధతలను, సదుపా యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జంగారెడ్డిగూడెం : రెండో రోజు కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలకు 95 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఏడు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలకు 2275 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 2370 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ సాగర్ బాబు తెలిపారు. పట్టణ పరిధిలోని తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే చోట వైట్ మార్క్ (ప్రమాదాలు గుర్తింపు)లను ఎస్‌ఐ సాగర్‌బాబు సమక్షంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సాగర్ బాబు మాట్లాడుతూ వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రాణ రక్షణ కవచం హెల్మెట్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల కేంద్రమైన ఆగిరిపల్లి గ్రామంలో జెడ్‌పి హైస్కూలు సమీపంలోని ప్రధాన రహదారిపై ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ ధారణపై పోలీసు సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎస్‌ఐ చంటిబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

అర్జునుడు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - కైకలూరు

టిడిపి ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, పార్టీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు, శాసన మండలి సభ్యులు బచ్చుల అర్జునుడు మృతి తీరని లోటని మాజీమంత్రి మాగంటి బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం అర్జునుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కైకలూరు, మండవల్లి మండలాల అధ్యక్షులు పి.త్రినాధరాజు, నారగాని నాగేశ్వరరావు, పార్టీ మండవలి ప్రధాన కార్యదర్శి పి.ఏడుకొండలు, వాణిజ్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జానీ, ఏలూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రకటన

In the Court of the Hon'ble II Addl. Junior Civil Judge cum II Addl. Judl. First Class Magistrate, Tadepalligudem

I.A. No. 19/2021 in O.S. No. 42/2021

Between:
Sri Penumaka Davidu Raju
...*Petitioner/ Plaintiff*
AND
Smt. Kolli Lora and Others
...*Respondents/ Defendants*

To:
The Executive Officer (R-8)
Sri Sitaramanjaneya Swami Devastanam, Prathipadu Village, Pentapadu Mandal, Tadepalligudem JCJ.

పై నెంబరు గల సివిల్ కేసులో పైన తెలిపిన గౌరవ కోర్టు వారు మీకు సమన్లు జారీ చేసి మిమ్మల్ని కోర్టుకు హాజరు కావాలని ఆదేశించినప్పటికి, సదరు సమన్లను మీరు తీసుకోనందు వలన పైన తెలిపిన గౌరవ కోర్టు వారు ప్రత్యామ్నాయంగా ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లను మీకు సర్వీసు చేయమని ఆదేశించి యున్నారు. అందువలన మీకు తెలుపునది ఏమనగా పై నెంబరు కలిగిన సివిల్ కేసు ది. 20-03-2023వ తేదీకి వాయిదా పడి ఉన్నది. ఆ దినమున అనగా **ది. 20-03-2023వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పైన తెలిపిన గౌరవ కోర్టు వారి ముందు తప్పనిసరిగా హాజరు కావలెను. ఆవిధంగా హాజరు కాని యెడల గౌరవ కోర్టు వారు మిమ్మల్ని ఎక్స్‌పార్టీ చేసి మీకు వ్యతిరేకంగా తీర్మానించెదరని యిందుమూలముగా మీకు తెలుపడమైనది.

R.VENKATESWARA RAO
Advocate, Tanuku
Cell: 9397151279

Tadepalligudem
Date: 16-03-2023